# ఢీ

చేతిలో పైసాలేకుండా పాతికేళ్ళక్రితం సిటీకొచ్చాడు యాదగిరి. అప్పటికి యాదగిరికి ఇర్వైయేళ్ళు.

సిటీలో తనకెవ్వరూ లేరు. అయినా బ్రతుకుతెరువుకోసం అనేకమార్గాలు అన్వేషించాడు.

స్వతహాగా తెలివైనవాడు కావడంతో అతని మెదడుకి మరింత పదును పెట్టగల తెలివి సిటీ వచ్చాక అబ్బింది.

బీదాబిక్కీని ఆశ్రయించి, వాళ్ళ పన్లు చేయిస్తానంటూ నాయకులదగ్గర పైరవీ చేస్తూ తన సంపాదన పెంచుకుంటూ వచ్చాడు యాదగిరి!

పేదల పొట్టకొట్టి సంపాదించిన డబ్బుతో మంచి ఇల్లు కట్టుకునే స్థితికి ఎదిగేడు.

యాదగిరి అండతో ఎందరో అభాగ్యులు స్వతంత్రంగా జీవించ గలుగుతున్నారు.

సిటీ నడిబొడ్డున ఏడెకరాల ఖాళీ స్థలం...

రాళ్ళుకొట్టి జీవించేవాళ్ళు... రిషాతొక్కి బ్రతికేవాళ్ళు... కూలీనాలీ చేసుకుని పొట్టపోసుకునే శ్రమజీవులు. పనీపాటా చేసుకుని కడుపు నింపుకునేవారు... ఇంకా ఎందరో కాపురం వుంటున్నారా గుడిసెల్లో!!

అక్కడి మనుష్యులతోపాటు పందులు, కుక్కలు, కోళ్ళుకూడా సహజీవనం చేస్తూంటాయ్.

గుడిసెవాసులంతా జనాభా లెక్కల్లో వున్నారు. వారికి ఓటుహక్కు వుంది.

గంజినీళ్ళు తాగుతూ... చీకటివేళకు సారామత్తులో తూగిపోతూ...ఆ మైకంలో అపారమైన ఆనందాన్ని అనుభవిస్తూ కటికనేలమీద పడుకుని... కలలు కనటం వారి జన్మహక్కు!

వాళ్ళు బ్రతుక్కి రక్షణ లేదు. మొర ఆలకించే నాథుడు లేడు. ఎదిరించగల శక్తీ లేదు.

ఎండకి ఎండుతూ... వానకి తడుస్తూ... రోగమొచ్చినపుడు ఆస్పత్రికి వెళ్ళలేక... నరకయాతన అనుభవించటం వారికి అలవాటు.

ఎన్నికలొచ్చినపుడుమాత్రం వాళ్ళ గుడిసెలమీద పార్టీ జెండాలు రెపరెపలాడతయ్. వాళ్ళ గొంతులు తడుస్తయ్. కాస్తోకూస్తో సొమ్ము కూడా ముడుతుంది. వోటు విలువ తెలీనివాళ్ళుగనక వాటిని అమ్ముకుని సంబరపడ్తారు. డబ్బిచ్చిన పార్టీకి ఓటేస్తారు. ప్రతి ఏటా ఎన్నికలొస్తే బావుండుననుకుంటూ వుంటారు.

ఎవరేం చెప్పినా తలూపి చెప్పినట్టు చెయ్యటం వారి అమాయకతకు నిదర్శనం.

ఇలాంటి దౌర్భాగ్యులందరికీ దేవుడు యాదగిరి.

యాదగిరి మాట అంటే వాళ్ళకు వేదం! అతనే వారందరికీ మార్గదర్శకుడు... కాదుకాదు... దేవుడు!!

యాదగిరి అండ చూచుకునే వారంతా సజావుగా బ్రతగ్గలుగుతున్నారు.

అక్కడ గుడిసెలు వేసుకోవటానికి పర్మిషన్ ఇచ్చింది యాదగిరే.

ఒక్కో గుడిసెకు నెలకు అయిదు రూపాయల చొప్పున సుంకం వసూలు చేసుకోవటానికి అలవాటుపడ్డాడు యాదగిరి.

అక్కడ నివసించేవాళ్ళ ఓట్లన్నీ పార్టీకి వేయిస్తానంటూ నాయకులతో మంతనాలు సాగించి... వేలు గుంజుకున్నా... పేదలకు ముట్టేది మాత్రం నామమాత్రంగానే!

ఆ రోజు రాత్రి... పది గంటలవేళ...

అక్కడి గుడిసెవాసుల్లో... కేకలు... అరుపులు... హాహాకారాలు.

పాతికమందికిపైగా జగజట్టీల్లాంటి గూండాలొచ్చి గడిసెల మీద దాడిచేశారు.

గుడిసెలమీద అప్పటివరకూ రెపరెపలాడుతున్న జండాలు పీకేశారు. ఆడవాళ్ళను తిట్టారు. మగాళ్ళను కొట్టారు. నానాబీభత్సం చేశారు.

"నా కొడకల్లారా... మీ ఓట్లన్నీ మాకేవెయ్యాల! మా పార్టీ డబ్బు తీసుకుని... వేరొక పార్టీ జండాలు మీ గుడిసెల మీద ఎట్లా ఎగుర్తయ్‌రా?..." గూండాలు గొంతు చించుకున్నారు.

అసలు పార్టీలంటే ఏమిటో తెలియని అక్కడి జనం లబోదిబోమన్నారు.

వాళ్ళ దెబ్బలు భరించలేక కొందరు యాదగిరికోసం పరుగుపెట్టారు.

అక్కడివారికి నచ్చజెప్పి, వాళ్ళని ఓదార్చి... ధైర్యం నూరిపోసిన యాదగిరి తిరిగి వెళ్ళిపోయాడు.

తెల్లవారేలోగా గూండాయిజానికి దిగిందెవరో తెల్సుకున్న యాదగిరి ఆ పార్టీ నాయకుడ్ని కల్సుకుని మంతనాలు సాగించాడు. చివరికి బేరం కుదుర్చుకున్నాడు. తన వెనక వున్న ఓటర్ల సంఖ్య వివరించాడు. ఓట్లన్నీ ఆ పార్టీకే వేయిస్తానని వాగ్దానం చేసి, నోట్లకట్టలతో ఇల్లు చేరుకన్నాడు.

యాదగిరి పబ్బం గడిచింది. పేదల ఓట్లను ఎరచూపించి సంపాదించిన డబ్బంతా బేంకులో వున్న తన ఖాతాలో జమ చేసుకున్నాడు.

గర్వంగా మీసం మెలేశాడు యాదగిరి. తమ అందరి తరఫున అన్ని రాజకీయపార్టీల దగ్గర నుంచి పెద్ద మొత్తంలో డబ్బు అందుకున్నాడనే నిజం గుడిసెవాసులకి తెల్సింది. అయినా నోరువిప్పి యాదగిరిని అడగ్గల ధైర్యం వాళ్లకు లేక నోళ్ళు మెదపలేకపోయారు. అది వాళ్ళ బలహీనతే అయింది.

ఎన్నికలు జడివాన జోరు ముగిసింది. ఏ పార్టీకి మెజారిటీ వచ్చింది... ఏ అభ్యర్థి గెలిచిందీ శ్రమజీవులకి తెలీదు. ఎవరు పదవిలోకొస్తేమాత్రం తమకెందుకు? తమ బ్రతుకులు బాగుపడేది లేదుకదాని నిరాశతో వుండిపోయారు.

★★ ★★ ★★

జీపులొచ్చి గుడిసెలముందు ఆగేయి. వాటిలోంచి అధికారులు దిగేరు.

జీపులు చూడగానే అక్కడివారంతా ఉప్పెనొచ్చినట్టు భయభ్రాంతులైనారు.

ఆడామగా పిల్లాజెల్లా అందరూ పరుగు పరుగున వచ్చి అధికారుల చుట్టూ మూగేరు.

బుర్రమీసాల బిళ్లజవాను ఛాతీ విరుచుకుని ఠీవిగా రెండు అడుగులు ముందుకేశాడు. అక్కడ మూగినవారి ముఖాల్లోకి గంభీరంగా చూశాడు.

సిగరెట్ వెలిగించి... తమ చేతిలోవున్న ఫైళ్ళు పరిశీలించటంలో నిమగ్నమైనారు అధికారులు.

'నేం చెప్పేది మీరంతా జాగర్తగా వినండి! మీరంతా ఇక్కడ గుడిసెలు వేసుకుని వుంటున్న స్థలం మున్సిపాలిటీవారిది. కాబట్టి... మీరంతా గుడిసెలు ఖాళీచేసి వెళ్ళిపోవాలని అధికారులు నిర్ణయించారు. నాలుగురోజుల్లోగా మీరిక్కడ్నించి వెళ్ళిపోకపోతే... మీ పాకలు పీకేయాల్సి వస్తుంది...'' బొంగురు గొంతుకతో బిగ్గరగా మాట్లాడేడు బిళ్లజవాను.

అక్కడున్న వారి ముఖాల్లో నెత్తురుచుక్క కరువైంది. ఒకరి ముఖాలొకరు చూచుకున్నారు. వారి గుండెల్లో దిగులు చోటు చేసుకుంది. కళ్ళల్లో నీరు తొణికిసలాడింది.

''అయ్యా! మేం పూటకు గతిలేనోళ్ళం. కష్టం చేసుకు బతికేవోళ్ళం... ఎన్నో ఏళ్ళుబట్టి ఇక్కడే వుంటున్నాం. మా నోళ్ళల్లో మట్టి కొట్టొద్దు... మాకు నీడలేకుండా చెయ్యద్దు...''

అంతా ఒక్కసారిగా బావురుమన్నారు. లాభం లేకపోవటంతో అధికారుల కాళ్ళమీద పడ్డారు.

వారి మొర ఆలకించని అధికార బృందం మళ్ళీ జీపులెక్కి వెళ్ళిపోయింది.

పేదవారి ముఖాల్లో... ఎన్నో ఏళ్ళుగా వారుంటున్న ఆ చోటు మీద మమకారం... వదిలివెళ్ళాల్సి వచ్చిందనే బాధ కొట్టొచ్చినట్టు అవుపించింది. వారిలో వారు చర్చించుకున్నారు. మరో చోటుకి తరలివెళ్ళద్దని తీర్మానించుకున్నారు.

అప్పటికప్పుడే ఓ పాతికమంది పోగై, యాదగిరి ఇంటికి పరుగు పెట్టారు.

జరిగినదంతా ఓపిగ్గా, శ్రద్ధగా విన్నాడు యాదగిరి.

''మీకేం భయంలేదు - నేనున్నాను. మీకు అన్యాయం జరగనివ్వను. ఈ విషయం అధికారులతో, మంత్రిగారితో మాట్లాడతాను. కానీ... ఒక్క విషయం! ఇప్పుడు మీరుంటున్న స్థలం మీ స్వంతం కావటానికి చాలా డబ్బు ఖర్చు అవుతుంది... అందుకు మీరంతా ఒప్పుకుని తలొక వంద రూపాయలు వసూలచేసి నాకిస్తే... మిగతా విషయం నేను చూస్తాను...''

యాదగిరి మాటమీద విశ్వాసంతో అప్పటికప్పుడే వాళ్ళు డబ్బు పోగుచేసి అతని కాళ్ళముందు వుంచారు. ధైర్యాన్ని కూడదీసుకుని తిరిగి వెళ్ళిపోయారు.

★★ ★★ ★★

ప్రభుత్వ వాహనాలు... పోలీసువారి శకటాలు మళ్ళీ అక్కడ ఆగేయి.

అధికారుల ఉత్తర్వుమేరకు గుడిసెలు ఖాళీ చెయ్యకపోవటంతో పోలీసుల అండతో రంగంలోకి దిగింది అధికారవర్గం.

బలవంతాన గుడిసెలన్నీ పీకేయబడి నేలమట్టం చెయ్యబడ్డాయి. ఆడ మగ తేడా లేకుండా అందరినీ చావబాదేరు.

యాదగిరి తమను ఆదుకోనందుకు ఆవేశంలో వూగిపోయారు గుడిసెవాసులు. తమకు జరిగిన అన్యాయానికి ప్రతీకగా పగ సాధించాలనే ఉద్దేశంతో అంతా ఏకమై ఉగ్రరూపం దాల్చారు.

తమ నుంచి ఎంత డబ్బు యాదగిరి వసూలు చేసినా బాధపడలేదు. తమనీ అడ్డం పెట్టుకుని పార్టీల నుండి ఎలక్షన్ల సమయంలో సొమ్ము సంపాదించినా సహించారు.

చివరికి తమ జీవితాల్లో నిప్పులు వర్షిస్తున్నా పట్టనట్టు వూరుకున్న యాదగిరిమీదికి దాడికి బయల్దేరారు.

గునపాలతో, కర్రలతో ఇంటిమీదికొచ్చినవారిని చూచి బెదిరిపోయాడు యాదగిరి.

కొండను 'ఢీ' కొనే ప్రయత్నంలో నిరాశ్రయులైనవారంతా ఏకమై, యాదగిరిని చావబాదేరు. కసి తీర్చుకున్నారు. అప్పటికిగాని వారి ఆవేశం చల్లారలేదు.

---

★ *(5-7-92 ఆంధ్రభూమి ఆదివారం దినపత్రికలో ప్రచురితం)*

పట్టు, ఫ్యాన్సీ చీరలు,
మెగా షోరూం
ప్యాట్నీ సెంటర్
చందన బ్రదర్స్
సికింద్రాబాద్

బంగారు ఆభరణాలకు
తరుగులేదు (NO WASTAGE)
CHANDANABROS JEWELLERS
PATNY CENTRE
SECUNDERABAD